ప్రజాశక్తి

సోమవారం 20 అక్టోబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



టపాసుల ధరలు పైపైకి..

5లో



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికే సుంకాలు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

5లో

కొత్త పరిశ్రమల కోసం

తిప్పలేల..?



జిల్లా డెయిరీ కార్యాలయం (ఫైల్)

- చారిత్రక పరిశ్రమలు మూసేశారు..
- జిల్లా డెయిరీ తెరిస్తే పాడిపరిశ్రమకు పూర్వవైభవం
- గనుల లీజులు ప్రైవేటు కంపెనీలకు అప్పగించి సంక్షోభానికి తెరలేపారు..
- రిలయన్స్ ఇంధన ప్లాంటు కోసం ఆ సంస్థను బతిమిలాడాల్సిన పరిస్థితి
- చిన్న కంపెనీ పెడతామన్నా భూములు, రాయితీలు ఇస్తామని భరోసా

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండంటూ మన పాలకులు తిరుగుతున్న పరిస్థితి చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. ఇక్కడ ఉన్న వనరులు, అవకాశాలను వదిలేసి చిన్నచిన్న దేశాలు పోతున్నారు. పెట్టుబడులు పెట్టండంటూ వేడుకుంటున్నారు. ఈ పరిస్థితిఎందుకు వచ్చింది? అనేది ఆలోచించాలి. మనకు అనేక వనరులున్నాయి. అవకాశాలూ ఉన్నాయి. సహజ వనరులు ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకుంటున్నాం. ముడిసరుకుగానే పంపడం వల్ల ఆదాయాలు పడిపోతున్నాయి. వాటిని ఆయా దేశాల్లో వస్తువులుగా మార్చుకుని నాలుగైదురెట్లు ఆదాయాలు పొందుతున్నారు. వీటిపై దృష్టి పెట్టకుండా కొత్త పరిశ్రమలు అంటూ తిరుగుతున్నారు. ఇంకా చెప్పాలంటే చారిత్రకమైన పరిశ్రమలూ మూతేశారు. నిర్వహణ లోపాలతో జిల్లా డెయిరీ మూతపడింది. 2021లో దీన్ని పూర్తిగా మూసేశారు. దీంతో ఉద్యోగులతో పాటు వేలాది మంది పాడి రైతులకూ నష్టం జరిగింది. దీన్ని తెరిపిస్తే ఎంతో మందికి ఉపాధితో పాటు పాడి పరిశ్రమకూ పూర్వవైభవం వస్తుంది. దీన్ని పూర్తిగా మరిచారు. దీనికి కేవలం రూ.75 కోట్లు కేటాయిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయం పక్కనబెట్టేశారు. ప్రైవేటు కంపెనీలకు వేలాది ఎకరాలు భూములు ఇవ్వడానికి వెనుకాడటం లేదు. జిల్లా డెయిరీని తెరిపిస్తే దానికి అనుబంధంగా ఉన్న పాలపొడి ఫ్యాక్టరీ కూడా పనిలోకి వస్తుంది. కనీసం ఇక్కడే 200 మందికి ఉపాధి లభిస్తుంది. జిల్లాలో 50 వేల మంది పాడి రైతులకు గిట్టుబాటు ధరలు, పాడిపరిశ్రమ నుంచి ప్రోత్సాహకాలు, రాయితీలు వస్తాయి. గతంలో దాణా ▶ 2లో

కొత్త పరిశ్రమల కోసం తిప్పలేల.?

(మొదటిపేజీ తరువాయి)

వంటికి కూడా సబ్సిడీలపై అందించారు. గ్రామాల్లో 400కు పైగా పాలకేంద్రాలున్నాయి. రవాణా వ్యవస్థ నడిచింది. వీటిపై వేలాది కుటుంబాలు బతికాయి. ఇప్పుడు ప్రవేటు కంపెనీల చేతుల్లోకి పాలసేకరణ, అమ్మకాలు వెళ్లాయి. కల్తీ పాలు వచ్చాయి. ప్రజల ఆరోగ్యాలు పోతున్నాయి. 100 ఎకరాల భూములు జిల్లా డెయిరీకి ఉన్నాయి. రూ.1200 కోట్ల ఆస్తులున్నాయి. ఇంతటి విలువైన సంపదను మూతపెట్టేశారు. ఇప్పుడు దాన్ని తెరిపిస్తే జిల్లాకు పరిశ్రమల కోసం పెద్దగా తిప్పలు పడాల్సిన అవసరం లేదు. ఇటీవల కనిగిరి ప్రాంతంలో బయోఇంధన పరిశ్రమ పెట్టేందుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఇందుకోసం దానికి భూమితో పాటు అన్నీ సౌకర్యాలు, రాయితీలు ఇస్తున్నారు. అక్కడ ప్లాంటు పెట్టించేందుకు ఆ సంస్థను బతిమలాడాల్సిన పరిస్థితి వచ్చింది. అదే ప్రభుత్వ రంగంలో ఉన్నవాటికి ప్రాధాన్యత ఇస్తే పరిస్థితి మరోలా ఉండేది. కనిగిరి, దొనకొండ వద్ద పరిశ్రమల కోసం నానాతిప్పలు పడుతున్నారు. ప్రైవేటు కంపెనీల కాళ్లావేళ్లా పట్టుకోవాల్సి వస్తోంది. అయినా ఎవరూ రావడం లేదు. జిల్లాలో ఉన్న సహజవనరులను బట్టి ఇక్కడ ప్రభుత్వ రంగంలోనే కొన్ని పరిశ్రమలు పెడితే ఉపాధి పెద్దఎత్తున వస్తుంది. కరేడు వద్ద ఇండోసెల్ కంపెనీకి 8,500 ఎకరాల భూమిని కేటాయించారు. రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోలేదు. ఈ కంపెనీకి ఇంత మొత్తంలో రైతుల భూములను ఇచ్చేస్తున్నారు. అక్కడ ఆ సంస్థ ఎంతమందికి ఉపాధి కల్పిస్తుందో కూడా స్పష్టత లేదు. ఈ పాటికే జిల్లాలో వాన్‌పిక్, దొనకొండ, కనిగిరి సెజ్‌లకు కేటాయించిన 30 వేల ఎకరాల భూములు ఖాళీగానే ఉన్నాయి. ఇప్పటికీ ఒక్కటంటే ఒక్క పరిశ్రమ రాలేదు. జిల్లాలో గనులు విస్తారంగా ఉన్నాయి. గ్రానైట్‌తో పాటు ఇతర గనుల లీజులను ఇపుడు ప్రవేటు కంపెనీకి అప్పగించారు. ఆ కంపెనీ ఇక్కడ చెక్‌పోస్టులు పెట్టి ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే రెట్టింపు ఇవ్వాలని డిమాండు చేయడంతో గ్రానైట్ పరిశ్రమ ఆందోళనలో పడింది. రెండు వారాల పాటు ఫ్యాక్టరీలను మూసేశారు. ఇలాంటి చర్యలతో ఉన్న పరిశ్రమలు సంక్షోభంలో పడుతున్నాయి. ఇంకా సహకార రంగంలో అనేక అవకాశాలున్నాయి. వాటిపైనా అధ్యయనం లేదు. సూపర్‌బజార్లు సరిగా నడవటం లేదు. పశుక్షేత్రం అభివృద్ధికి చర్యలు లేవు. జిల్లాలో గనులు, పండ్ల తోటలు, పొగాకు, పత్తి, రొయ్యలు, మిర్చి, సుబాబుల్ వంటివి విస్తారంగా సాగులో ఉన్నాయి. వీటి ఆధారంగా అనేక పరిశ్రమలు పెట్టడానికి అవకాశాలున్నాయి. వాటిపై దృష్టి కనిపించడం లేదు. జ్యూస్ ఫ్యాక్టరీలు, పొగాకు అనుబంధ పరిశ్రమలు, కాగితం పరిశ్రమ, జిన్నింగు మిల్లులు వంటివి సహకార రంగంలో ఏర్పాటుకు అవకాశాలున్నాయి. సహకార రంగంలో ఉన్న ఇంకొల్లు స్పిన్నింగు మిల్లునే ప్రవేటు కంపెనీలకు అమ్మేశారు. అంతా ప్రైవేటు వైపు పరుగులు తీస్తున్నారు. లాభాలున్నంతకాలం నడుపుతారు. నష్టాలు వస్తే మూతేస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ పాటికే మూతపడిన జిల్లా డెయిరీ వంటి వాటిపై దృష్టి సారించాలి. సహజవనరులను పరాయిదేశాలకు పంపే చర్యల వల్ల ఉపయోగం లేదు. స్థానికంగా పరిశ్రమలు పెట్టేవారికి ఇబ్బందులు లేకుండా చూడాలి. విదేశీ కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఇక్కడ వారికే ఇస్తే ప్రయోజనం. జిల్లాలో ఉన్న సహజవనరుల ఆధారంగా అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఫైర్ అవుట్ పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఫైర్ ఆఫీసర్

దుకాణాలను పరిశీలించిన ఫైర్ ఆఫీసర్

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో సీసీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా దుకాణాలను ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖరరావు ఆదివారం పరిశీలించారు. బాణాసంచా దుకాణాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే దుకాణ యజమానులు విధిగా అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసి ఉన్న ఫైర్ అవుట్ పోస్ట్‌ను పరిశీలించారు.

వై.పాలెంలో ఇసుక దందా

- ఒక్కో టన్ను రూ.1500
- దోపిడీకి తెర దీసిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో కూటమి నాయకులు యథేచ్ఛగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్రకృతిలో సహజంగా లభించే ఇసుక నేడు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక వ్యాపారం చేసిన నాయకులే ఇప్పుడు కూడా అన్ని గ్రామాల్లో ఇసుక వ్యాపారం చేస్తుండడంతో గృహ నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులు, పేద కుటుంబాలవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గృహాలను నిర్మించుకునే వారికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసినా ఇసుక కేంద్రాల వద్ద అధికారులు ఈ మేరకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఎర్రగొండపాలెంలోని ఇసుక కేంద్రాల వద్ద ఇవేమీ అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

టన్ను ఇసుక రూ.1500?

ఇసుక నిల్వ కేంద్రం వద్ద ఒక్కో టన్ను రూ.1500 చెల్లిస్తేనే లారీలోకి ఇసుకను లోడ్ చేస్తున్నారు. నిబంధన ప్రకారం సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నామని ప్రభుత్వం ద్వారా, లేదా సొంతంగా ఇల్లు నిర్మించుకుంటున్నామని ఆధారాలను చూపినా ఇసుకను మాత్రం తాము చెప్పిన ధరకు కొనుగోలు చేయకుంటే ఇసుక ఇవ్వమని చెబుతున్నారని పలువురు గృహ నిర్మాణాలు చేపట్టిన



లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టన్ను రూ.1500 కాక రవాణా సౌకర్యం కోసం లారీ యజమానికి రవాణా ఛార్జీ ఇవ్వాల్సి రావడంతో లారీలో 10 టన్నుల ఇసుకకు దాదాపు 20 వేలు అవుతుందని, ఇలా అయితే గృహం నిర్మించుకోవడం సాధ్యమయ్యే పని కాదని వాపోతున్నారు.

ఇసుక ఉచిత హామీ అమలు ఏది?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సొంతంగా గృహాలను నిర్మించుకునే వారికి, ప్రభుత్వం ద్వారా పక్కా గృహాలను పొంది నిర్మించుకునే అందరికీ ఉచితంగా ఇసుకను సమీప ప్రాంతాల్లోనే అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని అటకెక్కించింది. యథేచ్ఛగా అక్రమ ఇసుక దందాను మొదలుపెట్టింది.

చెక్ పోస్ట్ నిర్మించిన కూటమి నాయకులు

పలనాడు జిల్లా బొల్లేపల్లి మండలం గుట్లపల్లి సమీపంలోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి తూర్పు వైపు ఉన్న వాగు వద్ద ఓ ఆలయం ఉన్నది. ఆలయం వద్ద ప్రైవేటు వ్యక్తులు, ఇసుక లారీలను ఆపి కప్పం కట్టించుకుంటున్నట్లు సమాచారం. త్రిపురాంతకం మండలం గుట్టల ఉమ్మడివరం వద్ద ప్రైవేటు వ్యక్తులు వచ్చే లారీలను ఆపి టన్నుకి 600 రూపాయలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. కొన్ని లారీల యాజమాన్యం టన్నుకు 600 రూపాయలు ఎందుకు ఇవ్వాలి మేము ఇవ్వం అంటే సంబంధిత అధికారులకు ఫోన్ పోతుంది. ఫోను వచ్చిన వెంటనే అధికారులు హటావుటిన వెళ్లి సెటిల్మెంట్ చేస్తున్నట్టు సమాచారం. ఎర్రగొండ పాలెంలో టిడిపి ముఖ్య నాయకుడి అండదండలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు.

గ్రామాల్లో నిలిచిన పేదల ఇళ్ల నిర్మాణ పనులు

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి పేదలు తమకు ఇసుక ఉచితంగా భిస్తుందని ఉండగా, ప్రస్తుతం ఇసుక బంగారం ధరతో పోటీ పడుతోంది. దీంతో గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచాయి. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఇసుక దోపిడీని అరికట్టి, పేదలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని, ఇసుక రీచ్‌ల వద్ద పటిష్ట చర్యలు, పర్యవేక్షణ చేయాలని గృహ నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు.

దోర్నాల పోలీస్ స్టేషన్‌లో సీఐ తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్‌ను సీఐ అజయ్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో సమావేశమై స్టేషన్ స్థితిగతులు, ప్రాంతీయ భద్రతా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ప్రభాకర్‌రావును ఒంగోలు విఆర్‌కు బదిలీ చేయగా, ఒంగోలు విఆర్‌గా ఉన్న కే అజయ్ కుమార్‌ను ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఎస్‌పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో పోలీసు సిబ్బందితో సమన్వయం పెంచి కట్టుదిట్టమైన శాంతి భద్రతా చర్యలు కొనసాగిస్తామని అన్నారు. దీపావళి సందర్భంగా దుకాణాలపై ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీశైలం భక్తులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం అని తెలిపారు. పెద్దారవీడు పోలీసు స్టేషన్‌ను కూడా సీఐ తనిఖీ చేశారు.



సిఐ అజయ్‌కుమార్

ఘనంగా మహబూబ్ సుభాని ఉరుసు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ఇస్లాంపేట, నవాబుపేటలోని మహబూబ్ సుభాని దర్గాల వద్ద ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆయా దర్గాల వద్ద కులమతాల ప్రతీతంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ప్రార్థనలు చేశారు. స్థానిక ఎన్ఎస్పి కాలనీ సెంటర్, ఇస్లాంపేట సెంటర్, నవాబుపేట సెంటర్లలో భారీ విద్యుత్ దీపాలతో ముస్లిం చిహ్నాలను అలంకరించారు. ఇస్లాంపేట సెంటర్ నుంచి గంథం గుర్రంపై పట్టణంలో ఊరేగింపు నిర్వహించి, గంథం పంపిణీ చేశారు. కార్యక్రమాలలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పాల్గొని ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, తెలుగుదేశం సీనియర్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, కందిమల్ల గంగాధరరావు, పూనాటి వెంకటరావు, ఎడ్లపల్లి రాంబ్రహ్మం, గొల్లపూడి కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఎస్కే అహమ్మద్ బాషా, ముస్లిం యూత్ అధ్యక్షుడు ఎస్కే రఫీ, నాయకులు ఆప్సాలెహా, అల్లాబక్షి, యజ్దాని, ఖాజా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్‌ను ప్రత్యేకంగా అలంకరించి గుర్రంపై ఊరేగిస్తున్న ముస్లిములు

కంభంలో కల్తీ విక్రయాలు

ఆందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కంభం రూరల్

పట్టణంలో కల్తీ వస్తువుల ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కిరాణా షాపులలో మిరపపొడి, ధనియాల పొడి, పసుపు పొడి తదితర ఉత్పత్తుల ప్యాకెట్లపై ఎటువంటి ధరల వివరాలు కానీ, తయారీ తేదీలు కానీ, గడువు తేదీ గాని లేకుండా నిరాఘాటంగా విక్రయాలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని మార్కాపురం కేంద్రంగా శ్రీ సాయిరాం అనే ఓ జనరల్ స్టోర్ వారు ఎంఆర్‌పి లేకుండా తయారీ తేదీ, గడువు తేదీ లేకుండా విక్రయాలు సాగిస్తున్నారు. ఇటీవల కొందరు కొనుగోలుదారులు పసుపు, మిరప పొడి కొనుగోలు చేసి చూడగా ఆ ప్యాకెట్లపై ఎమ్మార్పీ, తయారీ తేదీ గడువు తేదీలు ముద్రించి ఉండకపోవడం చూసి అవాక్కయ్యారు. ఈ విషయం తెలిసి మరికొందరు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కిరాణా వ్యాపారులకు అధిక లాభాలు వస్తాయన్న దురాశతో ఇటువంటి ఉత్పత్తులను కొనుగోలు చేసి విక్రయాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తూనికలు కొలతల శాఖ వారు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తూతూ మంత్రంగా ఏడాదికి ఒకసారో రెండుసార్లో తనిఖీల పేరుతో వచ్చి ఎంతో కొంత ముడుపులు అందుకొని వెళ్లిపోతున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా సరైన విధంగా తనిఖీలు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025

దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీ పెరిగిందని, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమై పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం శిక్షణ తరగతులు కాలే శంకర్ అధ్యక్షతన పప్పు వెంకోబారావు మీటింగ్ హాల్లో జరిగింది. ముందుగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొమ్మలపాటి మాల్యాద్రి సోషలిజం-ఆవిష్కరణ గురించి క్లాస్ బోధించారు. రెండో క్లాసు సంస్కరణలు ప్రజలపై ప్రభావం, అంశంపై హనీఫ్ బోధించారు. పాలకులు ప్రజలపై అధిక భారాలు మోపి లాభాలు చేకూర్చడం వారి నైజం అని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసి గెలిచిన తర్వాత ప్రజలను మరచి పోతున్నారన్నారు. ప్రతి కార్యకర్త విద్యావంతులుగా అభివృద్ధి చెందాలని, వాస్తవాలను పరిశీలించాలని, దోపిడీ వ్యవస్థను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రతి పేదవాడికి భూమి, ఇంటి స్థలం, ప్రభుత్వ గృహం పంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సీఎస్‌పురం రూరల్ : పేదల, కష్టజీవుల సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండాయే అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ఎస్టీ కాలనీలో ఆదివారం సిపిఎం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హనీఫ్ జండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ పేదలు కష్టజీవులు సమస్యలతో సతమతమవుతున్నారని సమస్యలు పరిష్కరించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. పేదలకు ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాడేది సిపిఎం అన్నారు. సంక్షేమ పథకాలు అమలులో పేదల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని ఏ దళితపేట చూసినా గిరిజనుల కాలనీలు చూసినా సమస్యలే అన్నారు. ముఖ్యంగా కష్టం చేసుకుని జీవించే పేదలు మూడు పూటల తిండి తినలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రజెండా పోరాటాలతో అనేక సమస్యలు పరిష్కారం చేశామని అందుకు పేదలంతా ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఊసావెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, మండల కమిటీ సభ్యులు ఎం రత్నారెడ్డి, పి.నర్సింలు, ఉప్పలపాడు శాఖ కార్యదర్శి రత్నం, కాలనీవాసులు కొమ్మి ఆరోను, బాల యేసు, లక్ష్మయ్య, సుభాషిని, పోలయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో సిపిఎం జెండా ఆవిష్కరిస్తున్న సయ్యద్ హనీఫ్

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-పామూరు

వ్యవసాయ రంగంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలని కోరుతూ ఆదివారం సుందరయ్య భవనం సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవసాయ, పారిశ్రామిక రంగంలో భారతదేశంలో 50 శాతం సుంకాలను విధించారన్నారు. భారతదేశ వ్యవసాయ పారిశ్రామిక రంగాలను దెబ్బ తీయటానికి 70శాతంగా ఈ రంగంలో రైతు వ్యవసాయ కార్మికులు ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. ఈపాటికి వ్యవసాయం సంక్షోభంలో రైతులు ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని, దేశంలో ఆహార సంక్షోభం ఏర్పడుతుందని, పెద్ద ఎత్తున ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. రైతులు వ్యవసాయ కార్మికులు రోడ్డున పడతారని వెంటనే ప్రమాదకరమైన చట్టాలను వ్యతిరేకించలన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఐక్యమై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ట్రంప్ జీవోలను కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వై.వీర నారాయణ, సిహెచ్ వెంకటేశ్వర్లు, పి.శ్రీను, గౌస్ బాషా, అల్లాభక్ష, వై.జయరావు, వై.దేవరాజ్, ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.



జీవో కాపీలను దగ్ధం చేస్తున్న నాయకులు

హనుమంతరావుకు నివాళి

ప్రజాశక్తి-పామూరు

నుచ్చుపోత మాజీ సర్పంచ్ కీర్తిశేషులు దేవరపు హనుమంతరావు మొదటి వర్ధంతి సందర్భంగా ఆదివారం నుచ్చుపోత గ్రామంలోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పామూరు మండల టిడిపి అధ్యక్షులు బొల్ల నరసింహారావు, టౌన్ అధ్యక్షులు అమీర్ బాబు, కంబాలదిన్నె టిడిపి అధ్యక్షులు మన్నం రమణయ్య, దేవరపు మాల్యాద్రి, గల్లా చెన్నయ్య, పువ్వాడి బిల్డర్ వెంకటేశ్వర్లు, మెట్ల రాహుల్ ,తదితరులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు లర్పించినారు.



నివాళులర్పిస్తున్న కదిరి కుటుంబ సభ్యులు

కదిరి వెంకట నరసయ్యకు నివాళి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు తండ్రి కదిరి వెంకట నరసయ్య 33వ వర్ధంతి వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన కుమారులు కెవి.ప్రకాశ్‌రావు, కదిరి బాబురావు, కదిరి పార్థసారథి, కదిరి బాలకృష్ణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట నరసయ్య సమాధి వద్ద కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, మనవరాళ్లు, మనవళ్ళు, ముది మనవళ్ళు మరియు కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుంకరి వెంకటాద్రి, కెపి.నాయుడు, కదిరి కృష్ణ, ఇరగని చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మోటుమాల రోడ్డు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం మోటుమల గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో వాహనదారులు ప్రయాణించాలంటే కష్టతరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా రోడ్డు తీరు మారటం లేదని, వర్షం పడితే ఎక్కడ నీళ్లు అక్కడే ఉండి గుంటలమయంగా ఏర్పడుతుందని దీని ద్వారా ఆటోలు, మోటార్ బైకులు తదితర వంటివి ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే కొత్తపట్నం బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద సైడ్ వేసిన మట్టి వర్షాలకు కొట్టుకుపోతుందని ఈ ప్రభుత్వంలో నైనా ఈ రోడ్డు పూర్తవుతుందా లేదా అనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో అనేక చోట్ల రోడ్డు కోతకు గురైందని ఆర్అండ్‌బి అధికారులు మరమత్తులు చేయటంలో మత్తు నిద్ర వహిస్తున్నట్లు గ్రామస్తులు విమర్శిస్తున్నారు.



గుంతలు పడిన మోటుమాల రోడ్డు

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నవంబర్ 26న జరగనున్న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య చైతన్యం, రాజ్యాంగ అవగాహన పెంపొం దించడమే ఈ సంవత్సరం రాజ్యాంగ దినోత్సవం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా లోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల 8 నుంచి 10 వ తరగతుల విద్యార్థుల కోసం పోటీలు అక్టోబర్ 21న ప్రారంభమవుతాయని డీఈఓ తెలిపారు. పాఠశాల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించబడతాయన్నారు. 26 నుంచి 28 వరకు మండల స్థాయి, నవంబర్ 4 నుంచి 6 వరకు జిల్లా స్థాయి పోటీలు ఉంటాయన్నారు. ప్రతి విభాగంలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 26న అమరావతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

22న జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపికలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమాలలో భాగంగా అండర్-14 మరియు అండర్-17 బాల బాలికల వాలీబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ ఈ నెల 22వ తేదీ కొత్తపట్నం మండలం ఈతముక్కలలో నిర్వహించడం జరుగుతుందని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు డాక్టర్ చెక్క వెంకటేశ్వర్లు, ఏ. శిరీష కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 9.30 గంటలకు ఈతముక్కల ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని నాలుగు డివిజన్ల ఇన్‌ఛార్జిలు, మండల ఇన్‌ఛార్జిలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. విద్యార్థుల ఎంపికకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు యశోద 9866658730, లేదా దేవస్తం 9494427317 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘ నాయకులు

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

ప్రజాశక్తి-కనిగిరి

ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడం పట్ల ఏపీ ఎన్జీవోస్, ఏపీ జేఏసీ కనిగిరి నాయకులు పిల్లి వెంకట రమణారెడ్డి, షేక్ హజరత్ అలీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో వారు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఎ విడుదల చేయడం, హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై త్వరలో ఉత్తర్వులు జారీ చేయడం, పోలీసు సిబ్బందికి సరెండర్ చెల్లింపులు, పోస్టుల రీడిజిగ్నేషన్‌లపై నిర్ణయం తీసుకోవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. చైల్డ్ కేర్ లీవ్‌పై సీఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని కలిగించిందన్నారు. దీపావళికి ముందే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకొచ్చిన తీరు ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవోస్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

సిఎస్‌పురం: ప్రభుత్వం ఒక డిఎ ప్రకటించడం పట్ల మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకట్రామయ్య, షేక్.పాదుషా, జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అలాగే చైల్డ్ లీవ్ సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా ఉపయోగించవచ్చు అని ప్రకటించడం వలన మహిళా ఉద్యోగులకు చాలా ఉపయోగం అని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.



మాదాసి వెంకయ్యను సన్మానిస్తున్న నాయకులు

మాదాసి వెంకయ్యకు సన్మానం

ప్రజాశక్తి-కొండపి

వైసీపీ సీఈసీ సభ్యుడుగా పార్టీ కేంద్ర కార్యాలయం డాక్టర్ మాదాసి వెంకయ్యని నియమించింది. ఆదివారం ఉలవపాడు లోని డాక్టర్ వెంకయ్య గృహంలో కొండపి మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనా రిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్ సోషల్ మీడియా, అధ్యక్షు డు ఉప్పుటూరి వినోద్ కుమార్, బూచి నాగిరెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందినవారికి చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 లబ్ధిదారులకు రూ.30 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలిచేలా సంస్కరణలు తీసుకొస్తున్నారని అన్నారు.



జడ్జికి మొక్క అందిస్తున్న ఆర్డిఓ, తహశీల్దారు

సూర్యలంకకు విచ్చేసిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రముఖ పర్యాటక కేంద్రమైన సూర్యలంకకు ఎపి హైకోర్టు జడ్జి తుహిన్ కుమార్ విచ్చేసిన సందర్భంగా ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు షలీమా స్వాగతం పలికారు. మర్యాద పూర్వకంగా కలిసి జడ్జికి మొక్క అందజేశారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

ప్రజాశక్తి - బాపట్ల



అన్నం సతీష్ ప్రభాకర్

కుల, మతాలకు అతీతంగా దీపావళి పండుగ ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని శాసన మండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండాలని చెప్పారు. కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు. గాజు వస్తువులు, ప్లాస్టిక్ వస్తువుల్లో టపాసులు పెట్టి పేల్చవద్దని, ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు.



మాజీ టిడిపి చైర్మన్‌ను కలిసిన పావులూరు నాయకులు

సుబ్బారెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పావులూరుకు చెందిన వైసిపి నాయకులు టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యులైన వైవి సుబ్బారెడ్డిని హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిశారు. వైసిపి పరిస్థితులపై చర్చించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రస్తుత వైసిపి ఇన్చార్జ్ గాదే మధుసూదనరెడ్డి స్వగ్రామం. కార్యక్రమంలో పావులూరు సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పులకండ రామకృష్ణారెడ్డి, సింహాద్రి బ్రహ్మారెడ్డి పులకండ, జయరామిరెడ్డి, ముప్పవరపు శ్రీరాములు, మరెలా అజయ్ రెడ్డి ఉన్నారు.

దెబ్బతిన్న మినుముకు నష్టపరిహారం ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు



మినుము పంట పరిశీలిస్తున్న రైతు నాయకులు తలపనేని రామారావు

గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన మినుము రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్ట పరిహారం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని కొండమూరు, అలవలపాడు, తూర్పు తక్కెళ్ళపాడు గ్రామాల్లో సాగుచేసిన ఖరీఫ్ మినిము పైరును రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులు ఖరీఫ్‌లో మినుము పంట వేస్తే, రబీలో వేసే మొక్కజొన్న పంటకు పెట్టుబడిగా వస్తాయనే ఆశతో ఉన్నారని, అయితే గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మినుము సర్వనాశనమైందని అన్నారు. ఎకరాకు రూ.30 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని అన్నారు. ఇప్పుడు ఎకరాకు రెండు క్వింటాలకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనపడటం లేదని అన్నారు. మండలంలో 2,300 ఎకరాల్లో మినుము సాగు చేశారని అన్నారు. ఈ రైతులంతా నష్టపోయారని అన్నారు. ఇన్సూరెన్స్ మినుము రైతులకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎఓ డి సుబ్బారెడ్డిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా మండలంలో 2,300 ఎకరాల్లో మినుము సాగు చేశారని చెప్పారు. ఈ 2300 ఎకరాలకు ఈక్రాప్ పూర్తయిందని అన్నారు. ఇంకా ఎక్కడైన కొద్ది భాగం మాత్రమే ఈ క్రాప్ చేయించుకోలేదని అన్నారు. వర్షం జల్లులు జల్లులుగా కురవడంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, అందువలన పంట నష్టపరిహారం రాయటానికి వీలుకాదని అన్నారు. మండలంలో సాధారణ వర్షపాతం 200 ఎంఎం కాగా ఇప్పుటికి 120 ఎంఎం వర్షపాతం మాత్రమే నమోదైనట్లు తెలిపారు. ఏదైనా భారీ వర్షం కురిస్తే వర్షపాతం ఎక్కువగా నమోదవుతుందని, అప్పుడు నష్టపరిహారం రాసే అవకాశం ఉందని అన్నారు. గతంలో రైతులు సాగుచేసిన పంటలకు ప్రభుత్వం భీమా చేసేదని, ప్రస్తుతం అలా చేయటం లేదని అన్నారు. రైతులే తమ పంటలకు భీమా చేసుకోవాలని, అయితే మండలంలో రైతులెవరు తమ పంటలకు భీమా చేసుకోలేదని అన్నారు. భీమా వచ్చే అవకాశం లేదని తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు పాకనాటి కొండారెడ్డి, బండి చిన కొండారెడ్డి, బాచిన తిరుపతయ్య, జక్కం సుబ్బరామిరెడ్డి, భూమా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - రేపల్లె



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న అన్నారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయం కొరటాల మీటింగ్ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సిహెచ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జి రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 4.70 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు సిఎం ప్రకటించారని, ఈ ఏడాదిన్నర కాలంలో మెగా డీఎస్సీ తప్ప ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నట్లు ఉద్యోగాలు కల్పించలేదని అన్నారు. నిరుద్యోగులు నిరుత్సాహంతో ఉన్నారని అన్నారు. డీఎస్సీ తప్ప ఇతర చోట్ల చీపురు పట్టుకొని ఊడ్చే ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. కానీ ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేయడాన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గూగుల్ కంపెనీల్లో ఎక్కడ 500 మించి ఉద్యోగాలు లేవని, కానీ ఒక్క గూగుల్ డేటా సెంటర్ పెట్టుకొని 1.80లక్షల ఉద్యోగాలు ఇస్తామని లోకేష్ ప్రకటించడం యువకులు, నిరుద్యోగులను మభ్య పెట్టడమేనని అన్నారు. అసలు గూగుల్ కంపెనీలో 1.80లక్షల ఉద్యోగాలు లేకపోతే విశాఖలో పెట్టే గూగుల్ డేటా సెంటర్లో ఎలా ఇస్తారో చెప్పాలని అన్నారు. 600 ఎకరాలు పరిశ్రమల పేరుతో తీసుకొని ఒక్కరికి కూడా ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. రాయలసీమ వంటి ప్రాంతాల్లో వస్తున్న కంపెనీలో స్థానికులకు 70శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, ఆ రకంగా ఇవ్వట్లేదని, వాచ్మెన్ పోస్టులకు పరిమితం చేస్తున్నారని, అసెంబ్లీలో తీర్మానం చేసిన మాదిరిగా స్థానికులకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని ఉన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన సిఎం చిత్తశుద్ధితో వ్యవహరించి ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ కార్యదర్శి కెవి లక్ష్మణరావు, అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్, డివైఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ మణిలాల్ పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటి పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టణంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. పట్టణంలోని 9వ వార్డులో వడిగినేని హనుమంతరావు భార్య పార్వతి, వడిగినేని చింపిరయ్య భార్య ఆదిశేషమ్మ మృతి చెందగా ఇరువురి కుటుంబాలను పరామర్శించారు. 12వ వార్డులో మాడిశెట్టి ఏడుకొండలు గుండెపోటుతో మృతి చెందగా నివాళులర్పిఇంచారు. 4వ వార్డులో గార్లపాటి హరనాథ బాబు మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 18వ వార్డులో తెంపల అంజయ్య ప్రమాదవశాత్తు కాలుకు గాయమై ఉండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. తాడిబోయిన వెంకటేశ్వర్లు భార్య భారతి బైక్ ప్రమాదంలో గాయపడగా ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. 19వ వార్డులో మిరియంపల్లి పార్వతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆమెను పరామర్శించారు.

మేదరమెట్ల : మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. దైవాల రావూరులో చిన్ని సుబ్బారావు కుమారులు ఇటీవల మరణించగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. టిడిపి నాయకులు వజ్జా వేణు బాబు మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడుతుండగా వెళ్లి పరామర్శించారు. తిమ్మన్నపాలెంలో దేవరకొండ చంద్రరావు ఇటీవల మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట టిడిపి నాయకులు చెన్నుపాటి హరిబాబు, నరసింహారావు, సురేంద్ర, తిమ్మనపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, అవినాష్, దేవ సహాయం ఉన్నారు.



దైవాలరావూరులో పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డిఎస్పి రామాంజనేయులు

పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానమని డిఎస్పి గోగినేని రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆయన ఆదివారం ప్రారంభించారు. అధునిక సాంకేతికత గల సీసీ కెమెరాలు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రిచ వచ్చున్నారు. రహదారి ప్రమాదాలు జరిగితే వాహనాలు గుర్తించడానికి వీలు కలుగుతుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణ, ఎప్పటికప్పుడు ప్రజల కదలికలు గుర్తించడానికి సులువుగా ఉంటుందని అన్నారు. ఆకతాయిల ఆటలు కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రాంబాబు, ఎస్ఐ విజయ్ కుమార్, రెడ్ క్రాస్ సభ్యులు బూర్లె రామ సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని శింగరకొండక్షేత్రంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు సోమవారం సాయంత్రం 6 గంటల నుండి దీపావళి పండుగ సందర్భంగా దీపములు వెలిగించి టపాసులు కాల్చునున్నట్లు సహాయ కమిషనర్, ఇఓ మదమంచి తిమ్మనాయుడు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, దేవాలయం సిబ్బంది, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు

ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025

ఉద్యోగుల డిమాండ్లపై
సిఎం స్పందన హర్షణీయం
ఎపి ఎన్జీవో జిల్లా కమిటీ కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయమని ఎపి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శరత్ బాబు, కార్యదర్శి కృష్ణా రెడ్డి తెలిఆపరు. స్థానిక ఎన్జీవో భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో కె.శరత్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఏను విడుదల చేయడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు వారి సర్వీసు మొత్తం లో ఎప్పుడైనా చైల్డ్ కేర్ లీవ్ వినియోగించుకునే అవకాశం కల్పించటంతో కత్ఞతలు తెలియజేశారు. త్వరలోనే మంచి సి ఆర్ సి ఇస్తామని చెప్పడం ఉద్యోగుల్లో ఆనందం నెలకొందని, రాబోయే కాలం లో ఉద్యోగుల సమస్యలన్ని యన్ జి జి ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ విద్యాసాగర్ నేతత్వంలో ప్రభుత్వ సామరస్య ధోరణితో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి వాటి విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచిందన్నారు. జిల్లా అసుపత్రుల్లో చికిత్స పరిమితిని రూ,50,000 నుండి 71,00,000కి పెంచడం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగు రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల పైబడేలా పెంచడం ముదావహమనానరు. ఆరోగ్యశ్రీ విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీని సిఎం ఆదేశించటం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులర్, గ్రామ వార్డు సచివాలయాల నేషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం విద్యాసాగర్, రమణల నాయకత్వంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, జెఏసి నిరంతరం కషి చేస్తుందని తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమం లో జిల్లా కోశాధికారి కె శివకుమార్, జిల్లా సహాధ్యక్షులు యం వెంకటేశ్వర రావు, జిల్లా ఉపాధ్యక్షులు తేట శ్రీనివాసు, పి రామాంజనేయులు, కె చిరంజీవి రావు, బి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికే సుంకాలు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో కీలక రంగమైన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం మేర సుంకాలను విధించాడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు విమర్శించారు. ట్రంక్ విధించిన సుంకాలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశ ఉత్పత్తులను అమెరికాలో అమ్ముకోవడానికి 50 శాతం సుంకాలను ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ విధించాడని, మన దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి ఆయన పూనుకున్నాడని ధ్వజమెత్తారు. ట్రంప్ విధిస్తున్న సుంకాల వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.



నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు

సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ అమెరికా తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసమే సుంకాలను విధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ట్రంప్' సుంకాల కాపీలకు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు నిప్పంటించి.. నిరసన తెలిపారు. కార్యక్రమానికి రైతుసంఘం మండల కార్యదర్శి ఎన్‌వి. నరసింహం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు కరిచేటి హనుమంతరావు, సంఘం నాయకులు అన్ను వెంకటసుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుశీల, ఏ శేషారావు, గౌరవాధ్యక్షులు సుబ్బారావు, సీఐటీయు మండల కన్వీనర్ షేక్ మస్తాన్ ఐద్వా నాయకులు ఎన్ మాలతి, ఎస్కే నాగూర్‌బీ పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్షను నవంబర్ 14 నుండి 18 వరకు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఒంగోలు పేర్నమిట్ట శ్రీ ప్రతిభ కళాశాల ఆవరణలో భవిష్యత్తుకు బాట - కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీ ప్రతిభ విద్యా సంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు (రాము), సిఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ్, కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ డాక్టర్ జెవి షణ్ముక కుమార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జోనల్ హెడ్. బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిఎంను కలిసిన రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాజధాని అమరావతిలో అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కేంద్ర కార్యాలయాలకు స్థలం కేటాయించినందుకు సిఎంకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో పుట్టిన కె.రవికుమార్‌ను ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగు వారు బ్యాంకింగ్ రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఆనందంగా ఉందన్నారు. . విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం తో రాష్ట్ర. దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో అపార, అవకాశాలు కలుగుతాయని సిఎం తెలిపారు.


మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడారు. బీసీ ప్రధానిగా చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ, బిజెపి బిసి రిజర్వేషన్ల విషయంలో రెండు నాలుకల ధోరణిని దేశం గమనిస్తోందన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లోకి తీసుకురాలేమని నిస్సిగ్గుగా ప్రకటించారన్నారు. బిసి రిజర్వేషన్ల పెంపులో బిజెపి ద్వంద్వ నీతిని ప్రజలు గుర్తించాలన్నారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

టపాసుల ధరలు పైపైకి..

- 20-30 శాతం పెరిగిన ధరలు
- జిల్లాలో 143 దుకాణాలు ఏర్పాటు


ఒంగోలులో టపాసుల దుకాణాలను తనిఖీ చేస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దీపావళి సందర్భంగా టపాసుల ధరలు అమాంతం పెరిగాయి. టపాసుల ధరలు గత ఏడాది కంటే ఈ ఏడాది 20-30 శాతం అధికంగా పెరగటంతో ప్రజలు కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. టపాసులు తయారు చేసే కంపెనీలు ధరలు పెంచటం వల్లే తాము ధరలు పెంచినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

దీపావళి పండుగ చిన్న పిల్లల నుంచి ముసలి వారు వరకు వయోభేదం లేకుండా జరుపుకునే ముఖ్యమైన పండుగ. దీపావళి పండుగలో టపాసులు కాల్చటాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో ముసురు పట్టింది. టపాసుల దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు వచ్చినా వాతా వరణ మార్పుల కారణంగా శనివారం వరకు టపాసుల దుకాణాలు ఏర్పాటు కాలేదు.

జిల్లాలో 205 దుకాణాలు ఏర్పాటు

ప్రకాశం జిల్లాలో 205 టపాసుల దుకాణాలకు అధికారులు తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని చీమకుర్తి, సింగరాయకొండ, టంగుటూరు, మద్దిపాడు, ఒంగోలు అర్బన్, కొండపి, సంతనూతలపాడు, తాళ్ళూరు. నాగులుప్పలపాడు మండలాలలో 89 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. ఒంగోలు అర్బన్‌లో 42 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. కనిగిరి డివిజన్‌లోని కనిగిరి, పొదిలి, వెలిగండ్ల, దర్శి, హెచ్‌ఎంపాడు, పిసిపల్లి, పామూరు, కురిచేడు, దొనకొండ మండలాలలోని 56 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. మార్కాపురం డివిజన్ పరిధిలోని మార్కాపురం, యర్రగొండపాలెం, బేస్తవారపేట కంభం, దోర్నాల, రాచర్ల, త్రిపురాంతకం, అర్ధవీడు, కొమరోలు, గిద్దలూరు మండలాలలో 60 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు.

20-30 శాతం పెరిగిన ధరలు

టపాసుల ధరలు గత ఏడాది కంటే 20-30 శాతం పెరిగాయి. పండుగలో ప్రధానంగా వివిధ రకాల చిచ్చుబుడ్లు, మతాబులు, భూచక్రాలు, వంకాయ బాంబులు, తారా జువ్వలు, కాకర పూఒత్తులు, చర్చి లైట్స్, 1000 వాలా, 2000 వాలా, 5000 వాలా వంటి దీపావళి సామాగ్రి కాల్చటాన్ని ఇష్టపడతారు. గత ఏడాది ఒక కుటుంబానికి సంబంధించి సుమారు రూ.1000-1500లకు ఒక పాలిథీన్ బ్యాగ్ నిండా టపాసులు వచ్చేవి. నేడు రూ.2000-రూ.3000లు పెట్టినా ఒక పాలిథీన్ బ్యాగ్ నిండని పరిస్థితి ఏర్పడింది. చిన్న పిల్లలు మారం చేయటంతో తప్పనిసరి పరిస్థితులలో టపాసులు కొంటున్నట్లు కొందరు మహిళలు వాపోయారు. గత ఏడాది కంటే 20 శాతానికి పైగా ధరలు పెరిగాయని వారు చెప్పటం గమనార్హం.


ఒంగోలులో టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

టపాసుల తయారీ కంపెనీలు ధరలు పెంచటంతో తాము సైతం ధరలు పెంచి టపాసులు అమ్ముతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముసురు పట్టి వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో వ్యాపారాలు జరుగుతాయో లేదో అని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాలు సందర్శించిన డిఆర్ఒ

ఒంగోలు నగరంలోని పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయశాలలను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదివారం సందర్శించారు. విక్రయాలు జరుగుతున్న తీరు, ధరలు, ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్యలు, అవాంఛనీయ ఘటనలను సమర్ధంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ శాఖ సన్నద్ధత వంటి అంశాలను ఆయన పరిశీలించారు. బాణసంచా కొనుగోలుదారులతోనూ డిఆర్ఒ మాట్లాడారు. సూచించారు. డిఆర్ఓ వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

అమ్మకాలు అరకొరగానే..

ఎం.యానాది నాయుడు, టపాసుల హోల్‌సేల్ వ్యాపారి



ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గటం వల్ల టపాసుల అమ్మకాలు అరకొరగానే ఉన్నాయి. గతంలో కంటే అమ్మకాలు తగ్గాయి.. ప్రజలు టపాసులపై ఉండే నిబంధనలు చదివి.. ఆ విధంగా వాటిని కాల్చితే ప్రమాదాలు నివారించొచ్చు..

ఉపాధి హామీలో వెలుగుచూసిన అక్రమాలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

చనిపోయిన వారికి మస్టర్లు వేసిన వైనం ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదికలో వెలుగు చూసింది. ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం నుండి ప్రారంభమై ఆదివారం కూడా నిర్వహించారు. మండలంలో 2024-25లో నిర్వహించిన పనులుకు సామాజిక తనిఖీ బృందం ఈనెల 10 నుండి 17 వరకు 20 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా వేదికలో డ్వామా పీడీ విజయలక్ష్మి మాట్లాడారు. మండలంలోని 20 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించామని అన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పిడి విజయలక్ష్మి

రూ.14 కోట్ల విలువైన పనులు చేపట్టారని అన్నారు. అందులో వేతన రూపంలో రూ.10.33 కోట్లు ఉపాధి కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. ప్రజా వేదికలో ఆడిట్ బృందం మస్టర్ పొరపాటు తోపాటు చనిపోయిన వారికి ఉపాధి హామీ పనుల్లో డబ్బు చెల్లించినట్లు ఉందని అన్నారు. అక్కడక్కడ వర్క్ డీవెషన్ వచ్చిందని అన్నారు. కొన్ని పనులకు ఎపిడి పూర్తి విచారణకు రాశారని చెప్పారు. నగదు పొరపాటును బట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి బి సింగయ్య, డివిఒ జె చంద్రశేఖర్, గౌరీ శంకర్, ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, ఎంపిపి యలమంద, డిపిఎం సనిత, ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఎపిఒ బాలకృష్ణ నాయక్, పిఆర్ ఎఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


క్రీడాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థి

ప్రజాశక్తి - రేపల్లె

అట్యా పట్యా స్టేట్ సీనియర్ మీట్‌లో చెరుకుపల్లికి చెందిన పడితపు తన్విత్ లక్ష్మణ్ 3వ స్థానం సాధించటం అభినందనీయమని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో తన్విత్ లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు. గుంటూరు భాష్యం స్కూల్లో చదువుతూ అట్యా పట్యా నేషనల్ నగరికల్లో పల్నాడు జిల్లాలో అట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నకరికల్లులోని వంగా వెంకట రెడ్డి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 25,26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ అట్యా, పాట్యా ఛాంపియన్షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో హుబ్లీలో బెహల్గావ్‌లో జరిగిన జాతీయ సీనియర్ మీట్‌లో ఎపి టీంలో 3వ స్థానం సాధించి పేరు తీసుకువచ్చారని అన్నారు. తన్విత్ లక్ష్మణ్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తల్లి, దండ్రులు విజయ వెంకట కుమార్, వాసవి, ధర్మ తేజ పాల్గొన్నారు.

మృతుడు గుర్తింపు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


శ్రీనివాసరావు (48)

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈనెల 18న మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి, వలపర్ల మధ్య వ్యవసాయ క్షేత్రంలో గుర్తు తెలియని మృతదేహం బయటపడిన సంగతి తెలిసిందే. మృతదేహానికి తాళ్లతో రాళు కట్టి ఉండడంతో ఎక్కడో హత్య చేసి ఇక్కడ బావిలో పడేసినట్లుగా భావించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మీడియా ద్వారా మార్టూరు సిఐ మాదినేని శేషగిరిరావు విస్తృత ప్రచారం చేయడంతో ఇసుక దర్శికి చెందిన మృతుడి భార్య బంధువులతో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతుడు మారెళ్ళ శ్రీనివాసరావు (48) గా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకనే ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన ఒంటికి రాళ్లు కట్టుకొని బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు.

నరేంద్ర వర్మ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

దీపావళి పండుగ ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాణా సంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యుత్సాహానికి పోయి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పైపులైను మార్చే పనులు ప్రారంభం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంకు కేటాయించిన రూ.44 లక్షల జల్ జీవన్ మిషన్ నిధుల్లో అంతర్గత తాగునీటి పైపులైన్లు మార్చే పనులు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో రక్షిత నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉన్న విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.44లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపు లైన్లను మార్చే పనులు ప్రారంభించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ఇంటింటికీ నీరు అందించాలన్న ఆదేశాలతో పనులు ముమ్మరం చేస్తున్నారు. పనులు పూర్తి చేసి తాగునీటి కుళాయిలు ఇంటింటికీ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో గుదే తారక రామారావు, కోరిటాల వంశీ కృష్ణ, నిమ్మల సాంబశివరావు, రామేశ్వరరావు, మానుకొండు సాంబయ్య, పోపూరి సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు వర్షం ఆటంకం

ప్రజాశక్తి - బాపట్ల

అమావాస్య చీకట్లో వెలుగులు విరజిమ్మే దీపావళి బాణాసంచా విక్రయాలపై వర్ష ప్రభావం పొంచి ఉంది. దీపావళి పండుగ నేపథ్యంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా కొనేవారు రాక దుకాణాలు వెల వెల బోతున్నాయి. ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం కేంద్రీకృతమై సోమవారం నాటికి దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. దీని ప్రభావం బాణాసంచా విక్రయాలపై పడే అవకాశాలు ఉన్నట్లు విక్రేత దారులు ఆందోళన చెందుతున్నారు. స్కూల్ ప్రాంగణంలో 40 బాణాసంచా విక్రయాల దుకాణాలు ఏర్పాటు చేశారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సామాగ్రితో అలంకరించారు. వర్షం కురిసే


హైస్కూల్ ప్రాంగణంలో బాణాసంచా దుకాణాలు

అవకాశాలు ఉన్నట్లు ప్రకటించడంతో వ్యాపారుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఆదివారం ఉదయం నుండే వర్షం కురిసింది. వర్షం కారణంగా లాభం తర్వాత పెట్టుబడి చేతికొస్తే చాలని కొందరు వ్యాపారాలు చెబుతున్నారు. వర్షం కారణంగా సరుకు అమ్ముడు పోకపోతే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బాపట్ల

ఇంటర్ యూనివర్సిటీ 12వ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్ 14 ఫెన్సింగ్ పోటీల్లో బాపట్ల విద్యార్థుల అత్యంత ప్రతిభ కనబరిచారని స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి కె పౌలు కుమార్ ఆదివారం తెలిపారు. అత్యంత ప్రతిభను కనబరిచి సబ్ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ ఆల్ ఇండియా యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కాకినాడలో లక్ష్య ఇంటర్ నేషనల్ స్కూల్లో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత విభాగం ఈపీలో సాయి చరణ్‌కు బంగారు పతకం, సాబర్ విభాగంలో హర్షితకు కాంస్య పతకం, టీం విభాగంలో చరణ్ సాయి, హర్షిత, మిథిల్, జగదీశ్వర్, తనీష్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. మణిపూర్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్షిప్‌కు ఎంపికయ్యారని అన్నారు. గుంటూరులో



ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

జరిగిన ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీల్లో నవీన్ కుమార్‌రెడ్డి, రిషిత, మేఘన ఎంపికై పంజాబ్‌లో జరుగనున్న అల్ ఇండియా యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఫెన్సింగ్ కోచ్ ఆర్ నాగ చిరంజీవి క్రీడాకారులను అభినందించారు.

సముద్రంలో బోట్లతో పెట్రోలింగ్

ప్రజాశక్తి - వేటపాలెం

పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా సముద్రంలో బోట్లతో పెట్రోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ వి వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పొట్టి సుబ్బాయపాలెం బీచ్‌ని ఆయన పరిశీలించారు. బాపట్ల, చీరాల బీచ్‌కు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా శని, ఆదివారం వారాల్లో సిబ్బంది పెట్రోలింగ్ చేయాలని అన్నారు. పెట్రోలింగ్ చేసే సిబ్బందికి లైఫ్ జాకెట్లు విజిల్స్ ఇవ్వాలని సూచించారు. పొట్టి సుబ్బాయపాలెం బీచ్‌లో పారిశుద్ధ పనులపై దృష్టి పెట్టాలని చెప్పారు. పొట్టి సుబ్బయ్యపాలెం నుండి రామాపురం బీచ్ వరకు రోడ్డు విస్తరణ చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. బీచ్‌లో ఫ్లెడ్డ్ లైట్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. మత్స్యకారులతో ఆయన మాట్లాడారు. బీచ్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. మత్స్యకారులు చిన్న బోట్లతో


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

సముద్రంలోకి వేటకు వెళ్ళినప్పుడు చెన్నై నుండి పెద్ద బొట్లు వచ్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. చెన్నై నుండి జాలర్లు రాకుండా చూడాలని మత్యకారులు కోరారు. మత్స్యకారులు పొట్టి సుబ్బయ్యపాలెంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని సూచించారు. లోవోల్టేజ్ సమస్య ఉందని, ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్ ఫార్మ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను మత్స్యకారులు కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాజేష్, తహశీల్దా కె గీతారాణి పాల్గొన్నారు.


గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి రవికుమార్

మంత్రి గొట్టిపాటి అభినందన

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని 2వ వార్డులో గొట్టిముక్కల హరీష్ బాబు నూతన గృహ ప్రవేశానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. హరీష్ బాబు కుటుంబాన్ని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులో ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన మస్తురి రవి దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట టిడిపి నాయకులు నాగినేని రామకృష్ణ, కుందారపు రామారావు, వడ్లవల్లి పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

సీఎం స్పందన హర్షణీయం

ప్రజాశక్తి - అద్దంకి

దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక డిఏ విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థ సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారంలో ఉత్తర్వులు జారీ చేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించడం పట్ల ఎపి ఎన్జీఒ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించడం, సిఎం, మంత్రులతో జరిగిన స్నేహపూర్వక చర్చలు ఐదేళ్ల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకమని పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై సిఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. హెల్త్ కార్డు ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50 వేల నుండి రూ.1లక్షకు పెంచడం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగు రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల పైబడేలా పెంచడం సంతోషమని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ విధానాన్ని భీమా మోడల్‌గా మార్చే అవకాశాలు పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం వంటి నిర్ణయాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలని పేర్కొన్నారు. ఎన్‌జీఓ హోమ్‌లకు గతంలో మాదిరిగానే ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, బకాయిలు రద్దు చేయడం హర్షణీయమని తెలిపారు. ఏపీ జేఏసీ అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణకు అభినందనలు తెలిపారు.

పర్చూరు : ఉద్యోగుల డిమాండ్లపై సిఎం చంద్రబాబు స్పందన హర్షినియమని ఎపి ఎన్జీఒ సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు టి సుధాకర్, సిహెచ్ ప్రేమ్ చందు తెలిపారు. దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి డిఎ విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థ నడిపించేందుకు కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించాలని ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య భీమా, ఇహెచ్ఎస్ విధానాన్ని ఆదర్శంగా మార్చే అవకాశాన్ని పరిశీలించే అంశంపై తీసుకున్న నిర్ణయం ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. వైద్యసేవలను రూ.2 లక్షల నుండి రూ.5లక్షలకు పెంచడం హర్షణీయమని అన్నారు. సాధించగలిగిన ఎపి జెఎసి అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణకు అభినందనలు తెలిపారు.



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఘనసత్కారం

ప్రజాశక్తి - వేమూరు

ఎపి ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌కు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆదివారం ఘన సత్కారం చేశారు. కెఎస్ జవహర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో గుంటూరు ఎపి ఎన్జీఓస్ రిక్రియేషన్ హాల్లో నిర్వహించిన సన్మాన సభలో ఆనందబాబు మాట్లాడారు. సామాజిక న్యాయపదంలో అంచలంచలుగా నిబద్ధతతో సేవలు అందిస్తూ అనగారిన వర్గాల హక్కుల సాధనకు కృషి చేస్తున్న నాయకుడని అన్నారు. నిరంతరం సామాజిక న్యాయం కోసం కృషి చేస్తూ అణగారిన వర్గాల కోసం తమ జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. అనంతరం జవహర్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హనీ క్రిస్టియనా, కెఎస్‌కె విద్యా సంస్థల అధినేత కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు.



రచ్చబండలో పాల్గొన్న వైసీపీ నాయకులు

సమస్యల పరిష్కారానికే రచ్చబండ

ప్రజాశక్తి - వేమూరు

ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వంపై వత్తిడి చేయడానికి రచ్చబండ నిర్వహిస్తున్నట్లు వైసీపీ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు అన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు కొల్లూరు మండలం పెద్దలంకలో ఏర్పాటు చేసిన రచ్చబండలో మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు బాబు, చిలుమూరు ప్రభాకర్, చిలుమురు మత్తయ, కుంపటి శోభనబాబు, కుంపటి గోపి, తోట చంద్రమోళి, పెద్దలంక కన్వీనర్ దాసరి వెంకశ్వరావు, ఎంపిటిసి కనపర్తి మోహనరావు పాల్గొన్నారు.



దుకాణాలు పరిశీలిస్తున్న కమిషనర్, ఎఫ్ఒ

బాణసంచా దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

దీపావళి పండుగ సందర్భంగా మునిసిపల్ హైస్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను కమిషనర్ రఘునాథరెడ్డి, అగ్నిమాపక అధికారి రామ సిద్ధార్థ ఆదివారం పరిశీలించారు. బాణాసంచా అమ్మకాల దృష్ట్యా దుకాణ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేశామని అగ్నిమాపక అధికారి తెలిపారు. ప్రజలు బాణా సంచా కాల్చే సమయంలో అప్రమత్తతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మందులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని చెప్పారు. చిన్న పిల్లలు మందులు కాల్చేటప్పుడు పెద్దలు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రమాదాల నివారణ జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

అధ్వానంగా కొండమంజులూరు రోడ్డు



అధ్వానంగా కొండ మంజులూరు, కల్లంవారిపాలెం రోడ్డు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండ మంజులూరు నుండి కల్లంవారిపాలెం వెళ్లే రోడ్డు అద్వాన్నంగా మారింది. పెద్ద గుంటలు పడి, కనీసం టూ వీలర్స్ వెళ్ళటానికి కూడా ఇబ్బందిగా మారింది. 5 కిలోమీటర్లు పొడవున్న జెడ్‌పి రోడ్డును 1998లో తారు రోడ్డుగా మార్చారు. అప్పట్లో డొంక రోడ్డుగా ఉండేది. ఈ రోడ్డు ద్వారా కొండ మంజులూరు, కళ్ళంవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు, పొలాల్లో పంటలను ఇళ్లకు చేర్చుకునేందుకు ఉపయోగపడుతూ ఉండేది. జిల్లా పరిషత్ నిధులతో తారు రోడ్డుగా మార్చిన తరువాత ఈ రోడ్డు ప్రజలందరికీ ఉపయోగంగా ఉంది. ఇంకోలు మండలం, కొల్లవారిపాలెం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు జాతీయ రహదారికి చేరుకోవడానికి దగ్గర మార్గంగా ఉంది. రైతుల పంటలు ఇళ్లకు చేర్చుకోవడానికి సులభంగా మారింది. ఈ ప్రాంతంలో సుబాబుల్ సాగు ఎక్కువ ఉండటంతో సుబాబుల్ కర్ర లారీల్లో తీసుకెళ్లేందుకు ఉపయోగపడింది. ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉన్న ఈ రోడ్డు గత కొంతకాలంగా గుంతల మయంగా మారింది. రోడ్డు పగిలిపోయింది. వర్షం నీరు చేరి గుంటలు పెద్దవ-య్యాయి. ఈ ప్రాంతంలో ద్విచక్రవాహనాలపై వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంది. ట్రాక్టర్లు, లారీలు వెళ్లాలంటే ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మూడేళ్లుగా రోడ్డు పరిస్థితి బాగా లేకపోయినా పట్టించుకున్న నాధుడు లేడని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పునర్ నిర్మించాలని కోరుతున్నారు.

ప్రారంభమైన రోడ్ల నిర్మాణ పనులు



పావులూరు నాగండ్ల మధ్య రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పావులూరు నుండి నాగండ్ల వరకు దెబ్బతిన్న రోడ్డు పనులు గత నెల రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. గత 15ఏళ్లుగా ఈ రోడ్డు చెద్రమై దెబ్బతిని గుంటలతో నిండింది. ఇంకొల్లు నుంచి నాగండ్ల వెళ్లటానికి వాహనదారులు, పాదచార్లు ఇబ్బందులకు గురయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంకొల్లు నుంచి పావులూరు వరకు డబల్ రోడ్డు నిర్మాణం గతంలో చేయటంతో ప్రయాణానికి అనువు గానే ఉంది. నాగండ్ల నుంచి మార్టూరు మండలం కోళ్లపూడి మేదుగా ముప్పవరం జాతీయ రహదారికి పోవటానికి దగ్గర మార్గం. అయితే ఈ రోడ్డు గత కొన్నేళ్లుగా దెబ్బతింది. పావులూరు నుంచి నాగండ్ల వరకు ఆర్ అండ్ బి పరిధిలో లేదు. జడ్పీ పరిధిలో ఉంది. దీంతో ఈ రోడ్డు దెబ్బతిన్నప్పుడు ఆర్ అండ్ బి అభివృద్ధి చేయటానికి అవకాశం లేకుండా పోయింది. నాగండ్ల నుంచి కోళ్లపూడి, ద్రోణాదుల మీదుగా బొబ్బేపల్లి జాతీయ రహదారి మార్టూరు వరకు రోడ్లు ఉండటంతో కుటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరమ్మత్తులు, అభివృద్ధి చేశారు. ఇటీవల ఎమ్మెల్యే సాంబశివరావు కృషితో అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. చిన్నగంజాం మండలం చింతగుంపల, కడవకుదురు రోడ్డు నుంచి తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. నాగండ్ల, పావులూరు రోడ్డుకు రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఒంగోలుకు చెందిన స్నేహ కన్‌స్ట్రక్షన్స్ రోడ్డు అభివృద్ధి పనులు గత నెల రోజుల నుంచి చేపట్టారు. పావులూరు పల్లె ఆర్చి నుంచి నాగండ్ల ఊరి బయట పల్లె వరకు పనులు చేపట్టారు. రోడ్డు పగులగొట్టి రోడ్డు మార్జిన్లు అభివృద్ధి చేసి ఎర్ర కంకర వేశారు. రోడ్డుపై ఎర్ర కంకర తోపాటు డస్ట్ వేసి చదును చేస్తున్నారు. స్నేహ కన్‌స్ట్రక్షన్స్ వారే చింతగుపల తాడు రోడ్డు పూర్తి చేశారు. చింతగుంపల రోడ్డు బిటి రోడ్డు పూర్తి చేశారు. నాగండ్ల, పావులూరు రోడ్డు బీటీ రోడ్డుగా వేసేందుకు చురుగ్గా చర్యలు చేపడుతున్నారు. ఇంకొల్లు నుంచి ద్రోణాల, బొబ్బేపల్లి, నాగండ్ల, కోళ్లపూడి మీదుగా మార్టూరు జాతీయ రహదారికి పోవటానికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ద్రోణాల, బొబ్బేపల్లి, కోళ్లపూడి, తాటివారిపాలెం, బొల్లాపల్లి ప్రాంతాల్లో ఎర్ర గ్రావెల్, కొండలు ఉండటం తోపాటు మార్టూరు, బల్లికురవ ప్రాంతాల్లో గ్రానైట్ పరిశ్రమతో పాటు కంకరణ మిషన్లు ఉండటంతో ఆ ప్రాంతాల నుంచి ఎర్రమట్టితో పాటు డస్ట్ చిప్స్ ముక్క, కొండ రాళ్లు, కంచరాళ్ళు ఇంకొల్లు, చిన్నగంజాంలోని గ్రామాలకు, పర్చూరు, యద్దనపూడి, కారంచేడు మండలంలోని గ్రామాలకు నిత్యం సరఫరా అవుతూ ఉంటాయి. కడవకుదురు, చిన్నగంజాం, వేటపాలెం, పందిళ్ళపల్లి ప్రాంతాల నుంచి ఇసుక టిప్పర్లు, లారీలు ట్రాక్టర్లతో మార్టూరు మండలాల హైవే ప్రాంతానికి సరఫరా అవుతూ ఉంటుంది. దీంతో ఈ రోడ్లపై నిత్యం అత్యధిక బరువు వాహనాలు ప్రయాణం చేస్తూ ఉంటాయి. దీంతో ఎక్కువగా నాగండ్ల, పావులూరు, కోళ్లపూడి మధ్య రోడ్డు దెబ్బతింటు ఉంటుంది.

చెరువు కట్టకు మెట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా చెరువు కట్టపై నుంచి కిందకు దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయాలని సిఎస్‌పురం రైతులు కోరుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు గతంలో చెరువు కట్ట మలుపు వద్ద తూము ప్రాంతంలో కట్టపై నుంచి కిందకు దిగేందుకు అనుకూలంగా మెట్లు ఉండేవి. గత టిడిపి ప్రభుత్వంలో చెరువు కట్ట వెడల్పు చేశారు. ఆ సమయంలో ఈ మెట్లు తొలగించారు. కట్ట వెడల్పు చేసిన తర్వాత గతంలో ఉన్న మెట్లు స్థానంలో తిరిగి మెట్లు నిర్మిస్తానంటూ కాంట్రాక్టర్ రైతులను ఒప్పించి ఈ మెట్లను తొలగించినట్లు రైతులు తెలిపారు. అయితే చెరువు కట్ట వెడల్పు చేసే పని పూర్తియిన తర్వాత కాంట్రాక్టర్ తిరిగి మెట్లు ఏర్పాటు చేయలేదని, దీంతో తాము పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కట్టపై మొలచిన చిల్ల చెట్ల మధ్యలో చిన్న దారిలాగా ఏర్పాటు చేసుకొని పొలాలకు వెళుతున్నామని, ఈ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. మెట్లు లేకుండా ఆ చిన్న దారిలో వెళ్లడం ప్రమాదకరంగా ఉందని రైతులు చెబుతున్నారు. పొలం నుంచి గడ్డి మోపు తీసుకొని వచ్చే సమయంలో కట్ట ఎక్కే ప్రాంతంలో జారి పడుతన్నట్లు తెలిపారు. భయపడుతూ కట్ట పైకి ఎక్కాల్సి వస్తుందని మహిళా రైతులు వాపోయారు. చెరువు కట్ట ఎక్క కుండా తమ పొలాలకు వెళ్లేందుకు మరొక మార్గం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా చెరువు కట్టపై నుంచి కిందకు దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తమకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



వైసిపిలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌కుమార్

టిడిపి నుండి వైసీపీలో చేరిక

ప్రజాశక్తి - అద్దంకి

టిడిపి నుండి వైసిపిలో 50కుటుంబాలు చేరినట్లు వైసీపీ ఇంచార్జ్ చింతలపూడి అశోక్ కుమార్ తెలిపారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి నుండి చేరడంతో కష్టాలు ఎదురవుతాయని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రెండేళ్లు ఓపిక పడితే కష్టానికి తగ్గ ఫలితం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి వైసిపి గెలుపుకు కృషి చేయాలని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అనే బేధం లేకుండా కలసికట్టుగా పనిచేసి జగనన్న గెలుపుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ముస్లిం, యాదవ, ఎస్టీ వర్గాలకు చెందిన 50 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపి విధానాలకు ఆకర్షితులై వైసిపి పట్టణ అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు లక్కీనబోయిన రవి, చిట్టిబోయిన శ్రీనాథ్, దొండపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు.

భీమవరంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని వేమవరంలో తోటకూర రంగారావు చనిపోగా అతని కళ్లు దానం చేశారు. రంగారావు (52) గుంటూరు పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయం వైద్యులు కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాను సేకరించారు. భార్య హేమలత, తల్లి రత్నకుమారి, కుమారుడు మంజుదత్త, సోదరులు మోహన్ కృష్ణ, విజయభాస్కర్‌ను రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది బేబిరాణి

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని, వడ్డెరలకు తీవ్ర అన్యాయం చేశారని ఎపి వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ వేముల బేబీ రాణి తెలిపారు. గుంటూరు నుండి శ్రీశైల వెళుతూ మార్గమధ్యలో పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఆగి విలేకరులతో మాట్లాడారు. గత 50ఏళ్లుగా వడ్డెర పెద్దలు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉద్యమాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు 2014 నుండి అబద్ధపు వాగ్దానాలతో సరిపెడతున్నారని అన్నారు. సత్యపాల్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఎస్టీ జాబితాలో చేర్చుతామన్న హామీ నెరవేర లేదని అన్నారు. 2024 ఎన్నికల్లో సత్యపాల్ కమిషన్ పునరుద్ధించి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు వడ్డెర్లకు హామీ ఇచ్చారని అన్నారు. మైనింగ్ క్వారీల్లో 15 శాతం అవకాశం కల్పిస్తామంటున్నారని అన్నారు. జిఒ లేకుండా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వడ్డెరలకు మూడు ఎమ్మెల్సీ, ఒక రాజ్యసభ, ఒక చైర్మన్ పదవులు ఇచ్చి చట్టసభల్లో అవకాశం కల్పించారని అన్నారు. టిడిపి వడ్డెరలను ఓటు బ్యాంకుగా చూశారు తప్ప చట్టసభల్లో అవకాశం కల్పించలేదని అన్నారు. తమ హక్కుల సాధనకై నవంబర్‌లో విజయవాడలో ఉద్యమం చేపడుతామని అన్నారు. డిసెంబర్ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమాలో తన్నీరు సాయి కృష్ణ, ఓర్సు ఆంజనేయులు, బత్తుల జ్యోతి కుమార్, ఓర్సు శ్రీనివాసరావు, గోపి, రవిచంద్ర పాల్గొన్నారు.

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ప్రజలందరూ దీపావళి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా ఎస్పి బి ఉమామహేశ్వర్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

మాగుంట, దామచర్ల శుభాకాంక్షలు

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ పండుగలన్నిటిలో జాతి, మత, కుల, వర్ణ, వర్గ విభేదాలను విస్మరించి అందరూ జరుపుకొనే పండుగ దీపావళి పండుగ అని తెలిపారు.

నేడు పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావటంతో సోమవారం ఒంగోలు పిజిఆర్ఎస్ హాలులో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించగలరని ఆయన కోరారు.

బాపట్ల జిల్లా : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 20వ తేదీ దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించినందున సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని దీపావళి సెలవు సందర్భంగా సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలియజేశారు.

‘ఎల్ఐసి’లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వద్దు..

ఎఒఐ రాష్ట్ర కార్యదర్శి రవికిషోర్ డిమాండ్

ప్రజాశక్తి-కందుకూరు

భారతీయ జీవిత బీమా సంస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వెంటనే నిలిపివేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజషన్ ఆఫ్ ఇండియా (ఎఒఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రవికిషోర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ఐసి ఎఒఐ నెల్లూరు డివిజన్ 6వ మహాసభలు బెజవాడ శివయ్య అధ్య క్షతన కందుకూరు దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. రవికిషోర్ మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు పెంచాలని, వయో పరిమితి 85 ఏళ్లకు పెంచాలన్నారు. ఏజెంట్లు అందరికీ మెడిక్లెయిమ్ సౌకర్యం కల్పించాలని, పాత కమిషనర్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా దేశమంతా ఎల్ఐసి ఏజెంట్లకు పెన్షన్ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎల్ఐసి కాపాడుకోవడానికి ఎఐఓ అనేక పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు టి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాలసీదారులపై బలవంతంగా రుద్దిన జిఎస్టీ రద్దు కోసం చివరి వరకు పోరాటం చేసిన ఘనత ఏవోఐ దే అన్నారు. ఐఆర్డిఐఏ కార్యాలయం ముందు భారీ ఎత్తున ఏజెంట్లతో నిరసన చేపట్టిన నేపథ్యంలో బీ సగం నిలిపివేశారన్నారు. ఏజెంట్ల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఏం కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు ఎస్కెగౌస్ బాషా మహాసభలకు సంఘీభావం తెలిపారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింహారావు కోశాధికారి ధనుంజయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకటరావు, ఆల్ ఇండియా కౌన్సిల్ నెంబర్ పి.మహేష్, జోనల్ కమిటీ సభ్యులు సీఎం కొండయ్య, కందుకూరు బ్రాంచ్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, మధు, చీదేళ్ల సుబ్బారావు, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల ఏజెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒఐ రాష్ట్ర కార్యదర్శి రవికిషోర్

దీపావళి సందర్భంగా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నాం..

ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంత వరకు కాలుష్యరహిత టపాసులనే కాల్చాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి..

లైసెన్స్ ఉన్న దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలి. సూచించిన బహిరంగ ప్రదేశాలలో, వారికి కేటాయించిన ప్రాంతంలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లులలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరపాలి. నిబంధనలు పక్కాగా పాటించాలి. ప్రమాదాలకు తావు ఇవ్వకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయాలు జరపాలి. షాపుల మధ్య నిర్దేశించిన దూరం తప్పనిసరిగా పాటించాలి. ప్రతి టపాసుల విక్రయ షాప్‌లో నీరు, ఇసుక, అగ్నిమాపక యంత్రాలు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచకూడదు. పోలీసు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చిన్నారులతో తల్లితండ్రుల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చాలి. బాణాసంచా కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరించాలి. రోడ్డు వెంబడి వెళ్ళే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చుకోవాలి. ముందస్తుగా బకెట్‌లలో నీరు అందుబాటులో ఉంచుకొని జాగ్రత్త వహించాలి. లైసెన్స్ ఉన్న దుకాణంలోనే బాణాసంచా కొనుగోలు చేయాలి. బాణాసంచా ప్యాకెట్ పై ముద్రించిన తయారీ తేది, ప్యాకెట్‌పై తయారీదారు ముద్రించిన జాగ్రత్తలను పాటించాలి. పెద్దలు టపాసులు కాల్చేటపుడు పిల్లలను దూరంగా ఉంచాలి. ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలి. ఇంటిలోపల బాణాసంచా కాల్చకూడదు. సగం కాలిన టపాసులను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయడం, పట్టుకోవడం ప్రమాదకరం. దయచేసి అలా చేయకండి. గాజు సీసాలు, ఇనుప రేకులతో కూడిన పాత్రలలో బాణాసంచా కాల్చడం చాలా ప్రమాదకరం. ఆస్పత్రుల వద్ద బాణాసంచా కాల్చరాదని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 112 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని తెలిపారు.

యువతకు నైపుణ్యాభివృద్ధే ధ్యేయం

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
- ‘ల్యాబ్ ఇన్ వీల్స్’లో శిక్షణా తరగతులు
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాల అభివద్దే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ తెలిపారు. డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కిల్ సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. ల్యాబ్ ఇన్ వీల్స్ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై శిక్షణ ఇస్తున్నామన్నారు. విదేశాలలో నర్సింగ్, వెల్డర్, ఫిట్టర్ పోస్టులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా యువతకు అందిస్తున్న నైపుణ్య శిక్షణపై ‘డిఎస్డిఓ’ ప్రజాశక్తికి వివరించారు.

కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

4,598 మంది విద్యార్థులకు శిక్షణ

జిల్లాలోని 28 డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ సెంటర్స్ లో 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ వరకు 4,698 విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో నిరుద్యోగ యువతకు పది ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ వరకు 1576 మందికి శిక్షణ ఇచ్చాం.

ల్యాబ్ ఇన్ వీల్స్‌కు విశేష స్పందన

జిల్లాలో ల్యాబ్ ఇన్ వీల్స్ శిక్షణకు విశేష స్పందన లభిస్తోంది ఇన్ఫోసిస్ కంపెనీ ద్వారా 300 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫండమెంటల్స్, ఆమెజాన్ వెబ్ సర్వీసెస్,ఈ కామర్స్, డిజిటల్ మార్కెటింగ్, టాలీ విత్ జిఎస్టి, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక కోర్సుల్లో ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నాం.



ముఖాముఖి

యువతకు ఉద్యోగ అవకాశాలు

నిరుద్యోగ యువతకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై శిక్షణ ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 62 జాబ్ మేశాలు నిర్వహించాం ఆయా జాబ్ మేళాలకు 6435. మంది అభ్యర్థులు హాజరు కాగా 2815 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాం.

విదేశాలలో ఉద్యోగ కల్పనకు కృషి

విదేశాలలో నర్సింగ్, వెల్డర్, ఫిట్టర్ పోస్టులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ కృషి చేస్తోంది. విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించి యువత ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తుంది.

స్కిల్ ఇంటర్నేషనల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ

స్కిల్ ఇంటర్నేషనల్ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జర్మనీలో ఫిజియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్స్ జాబ్స్ ఉన్నాయి.వీటికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుంది. రెండు కోర్సులకు 18 నుంచి 40 ఏళ్ళలోపు వారు అర్హులు. ఫిజియోథెరపీకి బిపిటి/ఎంపిటి అర్హత కాగా జీం 2500 యూరోలు,. ఓటి టెక్నీషియన్‌కు డిప్లమో లేదా డిగ్రీలో ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ కోర్సు చేసి ఉండాలి. జీతం 2500-3000 యూరోలు ఇస్తారు. హెూం కేర్ నర్స్ అవకాశాలు ఖతర్-దోహాలో చేయాల్సి ఉంటుంది. రష్యా దేశంలో కళాశాలలో మెటాల్లార్జీ కోర్సుపై శిక్షణ ఇవ్వనున్నాం. ఐటిఐ(ఫిట్టర్, వెల్డర్, మెకానికల్) చదివిన వారు అర్హులు. ఈ కోర్సులపై నిరుద్యోగ యువతకు అవగాహన కలిగిస్తున్నాం.

తగ్గిన జీఎస్టీ ధరలతో

ప్రజల జీవితాల్లో వెలుగులు

జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తగ్గిన జీఎస్టీ ధరలు ప్రజల జీవితాలలో మరిన్ని దీపావళి వెలుగులు నింపుతున్నాయని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. “సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్” ప్రచార ముగింపు కార్యక్రమం ఆదివారం ప్రకాశం భవనంలో ఘనంగా జరిగింది. జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ సత్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జిఎస్టి తగ్గటం వలన వివిధ రకాల వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. దసరా శరన్నవరాత్రుల ప్రారంభం నుంచి దీపావళి వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ రూపాలలో ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం తరఫున నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల ముగింపు సందర్భంగా ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్‌తో సహా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సురేంద్ర, జేసీ కుమారులు పాల్గొన్నారు.



కుమారులతో కలిసి బాణసంచా కాలుస్తున్న జేసీ గోపాలకృష్ణ